క్లుప్తంగా

ఆలయాల వార్షికోత్సవం ప్రారంభం



అచ్చంపేట: చామర్రులోని వరసిద్ధి వినాయక, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, అభయ ఆంజనేయస్వామి, పోలేరమ్మ ఆలయాల 9వ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి హాజరయ్యారు. ఆలయ పూజారులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలికల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

కనుల పండువగా కపోతేశ్వరుని కల్యాణోత్సవం



నకరికల్లు: చేజర్ల గ్రామంలోని గంగాభ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి కల్యాణ వేడుక మంగళవారం తెల్లవారుజామున కన్నుల పండువగా నిర్వహించారు. విశేషంగా అలంకరించిన స్వామి, దేవేరుల ఉత్సవ మూర్తులు కొలువుదీరగా పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ తంతును జరిపించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ మహోత్సవాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించారు. అనంతరం సుప్రభాతసేవ, బలిహరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

వాల్మీకి బోయలకు సముచిత స్థానం

సత్తెనపల్లి: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి బోయలకు సముచిత స్థానం కల్పించారని వాల్మీకిబోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎద్దులదొడ్డి కోటేశ్వరమ్మ చెప్పారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీలుగా ఇద్దరు వాల్మీకి బోయలకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు జిల్లా నుంచి డాక్టర్ మధుసూదన్, అనంతపురం జిల్లా నుంచి ఎస్. మంగమ్మకు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు.

సీసీఐ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా లక్ష్మీచెన్నకేశవరావు



సత్తెనపల్లి: వినియోగదారుల సమన్వయ సమితి (సీసీఐ) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు నియమితులయ్యారు. విశాఖ పట్నం వైష్ణవ్ గ్రాండ్ కాన్ఫరెన్సు హాల్‌లో సీసీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రెసిడెంట్ ఎ.గోవిందరావు, సీసీఐ విశాఖ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ ముత్యాల బాలాజీ చేతులమీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి వెంకట్రావు డయాలసిస్ చేయించుకోవడానికి ప్రతివారం చిలకలూరిపేటకు వస్తాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటకు వచ్చి డయాలసిస్ చేయించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో మద్దిరాల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పార్టీని సమన్వయం చేసుకోవాలి
- గృహ సారథులు బాధ్యతగా పనిచేయాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మార్గనిర్దేశం
- కట్టమూరులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ



కట్టమూరులో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉండగానే వైఎస్సార్ సీపీ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పని చేస్తోందని, సుశిక్షితులైన సైన్యం ఇందుకు సమర్థవంతంగా పనిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు సమష్టి కృషితో సమన్వయంతో పని చేయాలన్నారు. గృహసారథులు చిత్తశుద్ధితో పనిచేసి గత మూడేళ్లలో ఈ ప్రభుత్వం అన్ని వర్గాలకు పారదర్శకంగా అందించిన సంక్షేమ పథకాల గురించి క్షుణ్ణంగా వివరించి వారిని చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్చి 18 నుంచి ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం ప్రారంభమవుతుందని, అందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సంక్షేమ పథకాలను ఇంత పారదర్శకంగా అందించలేదని, ఈ విషయాన్ని గమనించాలన్నారు. వలంటీర్ల వ్యవస్థను విమర్శించిన తెలుగుదేశం పార్టీ కూడా కుటుంబ సాధికారత సారథి పేరుతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటుందని పేర్కొన్నారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినట్లుగానే తెలుగు రాని తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేష్ కూడా పాదయాత్ర చేస్తున్నారని, అయితే ఆ పాదయాత్రకు పెద్దగా స్పందన లేదని విమర్శించారు. అనంతరం గృహ సారథుల బాధ్యతలను అంబటి వివరించారు. శిక్షణ కార్యక్రమానికి రెంటపాళ్ళ, భట్లూరు, గుజ్జర్లపూడి, పెద్దమక్కెన గర్నెపూడి, కట్టమూరు, గోరంట్ల గ్రామాల నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి , ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్ బి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి చిలుకా జయపాల్, మండల నాయకులు నల్లబోతు శివనారాయణ, కొర్లకుంట్ల వెంకటేశ్వర్లు, కొమెర శివశంకర్, నందిగం యల్లమంద, మందడపు పృథ్వీరాజ్, గాబ్రియేల్ పాల్గొన్నారు.

దుష్టచతుష్టయాన్ని తరమండి

- మంచిని ప్రోత్సహించండి
- గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



చిరువ్యాపారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: మూడున్నరేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిరంతరం ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ మరింత మంచి చేసే దిశగా అడుగులు వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని, గతంలో మట్టి, ఇసుక అమ్ముకుని రూ.వేల కోట్లు వెనకేసుకున్న గత ప్రభుత్వ పాలకులు, ఎల్లో మీడియాతో కూడిన దుష్టచతుష్టయాన్ని తరిమికొట్టాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన అచ్చంపేట సచివాలయం-1 పరిధిలో మూడో రోజు ఇంటింటికీ తిరిగారు. పాత ఎస్సీకాలనీ, కొత్త ఎస్సీకాలనీ, ఎస్టీ, బీసీ కాలనీలలో ఆయన పర్యటించారు. చిరు వ్యాపారులతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవి నీటి ఎద్దడిని నివారించాలని, రోజూ మంచినీరు సరఫరా చేయాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. త్వరలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ ఉచిత మంచినీటి కుళాయిలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు వేయడంపై కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి గత మూడున్నరేళ్లలో జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని మంచి పనులు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని స్పష్టం చేశారు.

చేసిన అభివృద్ధి ఇదిగో..

అచ్చంపేటలో కొత్తగా రూ.1.50 కోట్లతో పీహెచ్‌సీ భవనాన్ని, రూ.1.75 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో పోలీస్ స్టేషన్ భవనం, రూ.1.60 కోట్లతో బాలికలకు ప్రత్యేకంగా కేజీబీవీ జూనియర్ కళాశాల భవనం, రూ.1.85 గురుకుల పాఠశాల భవనం, రూ.1.80 కోట్లతో జెడ్పీ హైస్కూలు అదనపు తరగతి గదుల భవనాలను నిర్మించామని పేర్కొన్నారు. ఇవికాక మనబడి నాడు-నేడు పనులు, కమ్యూనిటీ హాల్స్, హెల్త్ క్లినిక్, జెడ్పీ అతిథి గృహ మరమ్మతులు, సీసీ డ్రెయిన్లు, రోడ్లు నిర్మించినట్లు వివరించారు. ఒక్క అచ్చంపేటలోనే రూ.22.09 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, అచ్చంపేట 1,2,3 ఎంపీటీసీలు గంగసాని బాబు, తెల్లమేకల నాగరాజు, షేక్ మొహిద్దీన్, ఏఎంసీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి చిన యల్లమందయ్య, మాజీ సర్పంచ్‌లు తుమ్మా చిన్నపరెడ్డి, సుంకర శ్రీనివాసరెడ్డి, మేకల శ్రీనివాసరావు, తాళ్లచెరువు సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, బీసీ సేన అధ్యక్షులు షేక్ జాని, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షులు సాతర్ల శ్రీనివాసరావు, పార్టీ అచ్చంపేట టౌన్ కన్వీనర్ సమరం, మండల సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ, మైనారిటీ నాయకులు షేక్ కమల్‌సైదా, ఉప సర్పంచ్ షేక్ జాని, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, మాదిపాడు కరిముల్లా, సందెపోగు పున్నారావు, లక్ష్మణబాబు, చెన్నకేశవులు, రామిశెట్టి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రగతిని వివరించండి

గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



హాజరైన వలంటీర్లు, గృహ సారథులు

అచ్చంపేట: గ్రామ వలంటీర్లతోపాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, అప్పటికి ఇప్పటికి వచ్చిన తేడాను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. రానున్న కాలంలో పెదకూరపాడును మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామని, రూ.65 కోట్లతో మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి, రూ.150 కోట్లతో అమరావతి నుంచి బెల్లంకొండ వరకు మూడు లైన్ల రోడ్డు, పులిచింతల ప్రాజెక్టు నుంచి అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండలాలకు సాగునీరు వంటి సౌకర్యాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలనూ తీసుకురానున్నట్టు వెల్లడించారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా క్రోసూరులో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం, మాదిపాడి బ్రిడ్జి, అమరావతి రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు.

వైఎస్సార్ సీపీదే గెలుపు

పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ సీపీదే గెలుపని ధీమా వ్యక్తంచేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఈసారి నంబూరు శంకరరావుకు 50వేలకు పైగా మెజారిటీ తీసుకొచ్చే లక్ష్యంతో పనిచేద్దామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ బాజీ, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఉప ఎంపీపీ గంగసాని బాబు, నెల్లూరి చంద్రబాబు, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి చినయల్లమందయ్య, అంబటి నారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వర్గీయులు

రుద్రవరం గ్రామానికి చెందిన మూడు కుటుంబాల టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో మాగం శ్రీనివాసరావు, భాస్కరరావు, వినోద్‌తోపాటు సుమారు 20 మంది ఉన్నారు. కార్యక్రమంలో రుద్రవరం ఎంపీటీసీ మేకా మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు తలతల శివారెడ్డి, అనుముల సాంబిరెడ్డి, పూల వెంకటేశ్వర్లు, ఈమని బ్రహ్మారెడ్డి, తలతల మహేష్‌రెడ్డి, పాడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాతృభాషోత్సవాలు



తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

అమరావతి: మునగోడు జెడ్పీ హైస్కూల్‌లో మాతృ భాషోత్సవాలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మాతృభాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు

చాగంటివారిపాలెంలో ఫ్యామిలీ ఫిజిషియన్



విద్యార్థులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ జయకృష్ణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో ఫ్యామిలీ పిజిషియన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, సూర్యప్రకాశరావు పాల్గొని 94 మందికి వైద్యసేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పీటర్‌డానియేల్, జోస్పిన్‌రాణి, నాగమల్లేశ్వరరావు, భవానీకుమారి, ఏఎన్ఎం వెంకటరత్నం, నూర్జహాన్, డీఈఓ రవితేజ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో సహజ మరణం పొందిన వ్యక్తికి ప్రభుత్వ సాయంగా రూ.10 వేలు మంగళవారం అందించారు. గ్రామానికి చెందిన బిల్లూరి శ్రీనివాసరావు(32) సోమవారం చనిపోయాడు. అతని మట్టిఖర్చుల నిమిత్తం తక్షణ సాయాన్ని గ్రామసర్పంచ్ గోపు అప్పమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ అందించారు.

అదుపు తప్పిన కారు, తప్పిన ప్రమాదం



పంటకాలువలోకి దూసుకెళ్లిన కారు

పెదకూరపాడు: ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ కారు అదుపుతప్పి పంటకాలువ వంతెనను ఢీకొట్టి కందకంలోకి దూసుకు వెళ్లిన ఘటన సత్తెనపల్లి-అమరావతి కాలచక్ర రహదారిలో 75త్యాళ్లూరుకు సమీపంలో మంగళవారం జరిగింది. అమరావతి మండలం మండెపూడి గ్రామానికి చెందిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు సోదరుడు కోట శ్రీనివాసరావు పాటిబండ్ల గ్రామంలోని యూనియన్ బ్యాంకులో లావాదేవీలు నిర్వహించేందుకు కారులో బయలుదేరారు. పక్కగా వెళ్తున్న మరో కారును క్రాస్ చేసే క్రమంలో ఆయన కారు అదుపుతప్పింది. పక్కనే ఉన్న పంట కాలువ వంతెనను బలంగా ఢీకొట్టి కందకంలోకి దూసుకు వెళ్లింది. కారుకున్న ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో శ్రీనివాసరావు కొద్దిపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికులు 75త్యాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం శ్రీనివాసరావును మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

బుల్లెట్ మెకానిక్‌పై కత్తితో దాడి



ప్రాథమిక చికిత్స పొందుతున్న పవన్‌కుమార్

సత్తెనపల్లి: బుల్లెట్ మెకానిక్ పవన్‌కుమార్‌పై కత్తితో దాడి జరిగిన ఘటన మంగళవారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణ సీఐ యు.శోభన్‌బాబు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బుల్లెట్ మెకానిక్ చేబ్రోలు పవన్‌కుమార్, మిత్రుడు వెంకటేష్ కలిసి పట్టణంలోని రఘురామ్‌నగర్ ప్లాట్ల వైపు నుంచి వస్తుండగా అదే సమయంలో పాత స్నేహితుడు గంటా రాహుల్ అలియాస్ పండు ఎదురయ్యాడు. తాను రూ.30 వేలు ఇవ్వాలని అందరికీ చెబుతున్నావంటా ఏమిటని పవన్‌కుమార్‌ను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాదనలు జరగడంతో కోపోద్రిక్తుడైన రాహుల్ కత్తితో పవన్‌కుమార్ మెడ, భుజంపై దాడి చేశాడు. వెంటనే పవన్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుడి మృతి



వివేకానంద మృతదేహం

సత్తెనపల్లి: ఆర్ఎంపీ వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో మంగళవారం జరిగింది. కర్నూలు జిల్లా అస్పరి మండలం కైర్పుల గ్రామం నుంచి మిర్చి పనుల నిమిత్తం లక్కరాజుగార్లపాడుకు పది రోజుల క్రితం 70 మంది కూలీలు వచ్చారు. వీరిలో గులిమి శేఖర్, చిట్టెమ్మ దంపతుల కుమారుడు వివేకానంద (11)కు ఈనెల 18న జ్వరం వచ్చింది. దీంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకు వెళ్ళగా ఇంజక్షన్ చేశాడు మరుసటి రోజు రమ్మని చెప్పాడు ఈనెల 19న ఉదయం ఆర్ఎంపీ అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్య ఇంజక్షన్ చేసింది. సాయంత్రానికి ఇంజక్షన్ చేసిన చోట గడ్డలు కట్టడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందారు. ఆర్ఎంపీ చూసి ఇబ్బందేమీ ఉండదని చెప్పాడు. గడ్డలు కట్టినచోట నల్లగా మారడంతో ఆర్ఎంపీ సూచనల మేరకు సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఇక్కడ లాభం లేదని చెప్పడంతో గుంటూరు తీసుకెళ్లగా మంగళవారం బాలుడు మృతి చెందాడు. దీంతో చిన్నారి వివేకానంద మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకొని సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టేందుకు వలస కూలీలు యత్నించారు. గ్రామస్తులు, పెద్ద మనుషులు జోక్యం చేసుకొని వారితో రాజీ సంప్రదింపులు జరిపారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. మృతదేహాన్ని తల్లిదండ్రులు స్వగ్రామానికి తీసుకు వెళ్ళారు.

బీసీల వెన్నుదన్ను సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: బీసీల పక్షపాతి, వెన్నుదన్నునని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని బీసీ సంఘ కార్యాలయంలో 18 ఎమ్మెల్సీ స్థానాలకు 11 ఎమ్మెల్సీ స్థానాలను బీసీలకు కేటాయించిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బీసీ సంఘాల నాయకులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పల్లపు ధర్మారావు, పులహరి బానోజీ, దుగ్గి భద్రయ్య, కుమ్మరి దస్తగిరి, గుంటూరు గోవిందు, విప్పర్ల కొండలు, వై.శ్రీనాథ్, పిక్కిలి శివ, గొట్టం వెంకటేష్, తేటనీళ్ల అప్పయ్య, కాటుమాల కుమార్,ఎస్ నాగరాజు,గుర్రం కృష్ణ, కలిదిండి సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేతోపాటు విద్యలోనూ రాణించాలి



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ శోభన్‌బాబు, ఎస్ఐ రఘుపతి

సత్తెనపల్లి: కరాటేతోపాటు విద్యలోనూ రాణించాలని పట్టణ సీఐ యు.శోభన్ బాబు విద్యార్థులకు సూచించారు. మచిలీపట్నం సమీపంలోని శరత్‌చంద్ర ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19న జపాన్ సిటోరియో కరాటే స్కూల్ నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2023 టోర్నమెంట్‌లో సత్తెనపల్లికి చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను సీఐ ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో 12 ఏళ్ల కటా విభాగంలో టీ జీవన్ ప్రథమ స్థానం, 11 ఏళ్ల కటా విభాగంలో జి.సాత్విక్ ద్వితీయ స్థానం, 25 ఏళ్ల కటా విభాగంలో జి.రవి ద్వితీయ స్థానం, బాలికల 11 ఏళ్ల విభాగంలో టి.శివశ్రీ ద్వితీయ స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, కోచ్ జి.రవిని, పల్నాడు జిల్లా కరాటే సెక్రటరీ జి.సాయిరాంను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రఘుపతి పాల్గొన్నారు.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి



నకరికల్లు: పొలాల్లో మిత్రపురుగులైన తూనీగ, సాలీడు, సన్న నడుము తూనీగ, బారు దవడల సాలీడుల సంతతిని కాపాడుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవరాయలు రైతులకు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరి పంట చిరుపొట్టదశలో ఉందని, ఎటువంటి శత్రుకీటకాల సంచారం లేదని పేర్కొన్నారు. అనంతరం పొలం పరిసరాల విశ్లేషణను చార్టుల ద్వారా రైతులకు వివరించారు. కొన్నిచోట్ల వరిలో అగ్గితెగులు స్వల్పంగా కనిపిస్తోందని, లక్షణాలను సత్వరమే గుర్తించాలన్నారు. ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రజత పతకం

శావల్యాపురం: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం టీం తరుపున స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి విద్యార్థి ఆకుమళ్ళ సమీరా సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలా ది శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహించిన 41వ సబ్ జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి శావల్యాపురం హై స్కూలు విద్యార్థి ఆకుమళ్ళ సమీరా మంచి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఈసందర్భంగా జాతీయస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థి సమీరాను పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, సర్పంచ్ రాపూరి వెంకయమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, మండల కో-ఆప్షన్ సభ్యులు అభినందించారు.